టీకాలతో జీవాలకు రక్ష

- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- వ్యాక్సిన్‌తోనే పశువులు, జీవాలు సేఫ్
- వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు



దాకమర్రిలో పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్ (ఫైల్)



వాక్సిన్ల గురించి రైతులకు అవగాహన కలిగిస్తున్న దాకమర్రి పశు వైద్యాధికారి కాంతికిరణ్

తగరపువలస: నైరుతి రుతుపవనాలు వచ్చేశాయి. వాన చినుకులు చల్లగా పలకరిస్తున్నాయి. అక్కడక్కడ భారీ వర్షాలు కూడా కురుస్తున్నాయి. ఈ సమయంలో పశువులు, గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కొత్తగా మొలకెత్తిన గడ్డిని తినడంతో పశువులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి వ్యాపించే ప్రమాదం ఉంది. ఈ రోగాల నివారణకు పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచితంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు.

నల్లజాతి పశువుల్లో గొంతువాపు వ్యాధి

నల్లజాతి పశువులైన గేదెలలో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతువాపు వ్యాధి వ్యాపిస్తుంటుంది. గొంతు కింది భాగం వాపుతోపాటు ఊపిరితిత్తులలో నిమ్ము చేరుతుంది. తద్వారా పశువులకు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం, గురకతోపాటు తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్తపరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారించి చికిత్స అందించాల్సి ఉంటుంది. ఈ గొంతు వాపు వ్యాధి నివారణకు తప్పనిసరిగా పాడిరైతులు వ్యాక్సిన్లు వేయించాలి.

తెల్లజాతి పశువుల్లో జబ్బవాపు వ్యాధి

తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బవాపు వ్యాధి వ్యాపిస్తుంది. పశువులకు జబ్బ, వెన్ను, తొడ తదితర కండ గల శరీర భాగాల్లో నల్లటి వాపు వస్తుంది. దీంతో పశువులకు జ్వరం రావడం, మేత మేయకపోవడం, కదలలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలున్న పశువులకు వెంటనే చికిత్స చేయించాలి. సకాలంలో చికిత్స చేయించకపోతే పశువులు మరణించే ప్రమాదం ఉంటుంది. ఈ జబ్బవాపు వ్యాధి వ్యాపించకుండా ముందుగా పశువులకు వ్యాక్సిన్లు వేయించాలి.

మేకలు, పొట్టేళ్లలో చిటుకు వ్యాధి

తొలకరి వర్షాలకు మొలకెత్తిన లేతగడ్డిని పొట్టేళ్లు, మేకలు తిన్నప్పుడు వాటిలో ఉండే బ్యాక్టీరియా, క్రిములు నేరుగా శరీరంలోకి వెళ్లడం ద్వారా చిటుక వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన జీవాలకు వెంటనే చికిత్స చేయించాలి. లేదంటే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి వ్యాపించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా వ్యాక్సిన్లు వేయించాలి.

ముమ్మరంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం

జిల్లాలో ఆవులు, గేదెలు, ఎద్దులు, దున్నలు, పొట్టేళ్లు, మేకలకు వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. జబ్బవాపు వ్యాధి రాకుండా ఆవులు, ఎద్దులకు బీక్యూ వ్యాక్సిన్, గొంతువాపు వ్యాధి రాకుండా గేదెలు, దున్నలకు హెచ్ఎస్ వ్యాక్సిన్, చిటుక వ్యాధి నివారణ కోసం పొట్టేళ్లు, మేకలకు ఈటీ వ్యాక్సిన్ వేస్తున్నారు. ఇప్పటికే ఈటీ వాక్సిన్, బీక్యూ వ్యాక్సిన్ దాదాపు పూర్తి కాగా హెచ్ఎస్ వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది.

అందిస్తున్న వ్యాక్సిన్లు

- ఈటీ వ్యాక్సిన్ : గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి రాకుండా
- బీక్యూ వ్యాక్సిన్ : ఆవులు, ఎద్దులకు జబ్బవాపు వ్యాధి రాకుండా
- హెచ్ఎస్ వ్యాక్సిన్ : గేదెలు, దున్నలకు గొంతు వాపు వ్యాధి రాకుండా

వ్యాక్సిన్ వేయిస్తే మంచిది..

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తెల్ల, నల్లజాతి పశువులతోపాటు జీవాలలో అత్యధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ముందు జాగ్రత్తగా వాటి సంరక్షణకు తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలి. దీని ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు. పశువులకు ఎవరైనా అత్యవసర చికిత్స అందించాలనుకుంటే 1902 నంబరుకు ఫోన్ చేస్తే సంచార వాహన సిబ్బంది వచ్చి వైద్యసేవలు అందిస్తారు. ఇప్పటికే ఈటీ వ్యాక్సిన్, బీక్యూ వాక్సిన్ పూర్తికాగా హెచ్ఎస్ వ్యాక్సినేషన్ జరుగుతోంది. జూలై నుంచి గొర్రెలకు బ్లూ టంగ్ (నీలి నాలుక) వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వ్యాక్సిన్లను సద్వినియోగం చేసుకోవాలి.

– జి.కాంతి కిరణ్, పశువైద్యాధికారి, దాకమర్రి, భీమిలి మండలం

జిల్లాలో పశువుల వివరాలు

ఆవులు	- 41,549
గేదెలు	- 25,806
మేకలు	- 32,477
గొర్రెలు	- 46,720



గొర్రెలకు వ్యాక్సిన్లు వేస్తున్న పశు వైద్యాధికారి దినేష్‌కుమార్

వైభవంగా అప్పన్న కల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా

తగరపువలస : రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి బుధవారం తన రాజీనామాను గుంటూరులోని స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించడంతో ఇచ్ఛాపురం నుంచి నెల్లూరు వరకు గల రెడ్డిక సామాజిక వర్గానికి బీసీ సర్టిఫికెట్ల సాధనకు కృషి చేశానన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొమ్మాది : భీమిలి బీచ్ రోడ్డులో తొట్లకొండ ఎదురుగా ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయాన్నే అటుగా వెళ్తున్న వాకర్స్ గమనించి భీమిలి పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. మృతుడు ఒడిశాకు చెందిన వ్యక్తిగా గుర్తించామని, మతిస్థిమితం సరిగా లేదని, ఇదే ప్రాంతంలో గత నాలుగు రోజుల నుంచి తిరుగుతున్నాడని ఎస్ఐ హరీష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో సుత్తమ్మతల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పువ్వులు, తులసి మాలలు, గజమాలలతో అలంకరించారు. అమ్మవారి ఆలయానికి భక్తులు విశేషంగా పోటెత్తారు. సాయంత్రం వరకు ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగింది.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు



సేవాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస: మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జీవీఎంసీ 4వ వార్డు రామయోగి అగ్రహారంలోని సద్గురు సేవాశ్రమంలో బుధవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, స్వీట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు యోగా రాజు, ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్, బేసిక్స్ సైన్స్ విభాగాధిపతి జె.ఆర్.జి.పట్నాయక్, అధ్యాపకులు వి.ప్రదీప్ కుమార్, చిన్నయ్య, రాము పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా



శ్రమజీవుల కాలనీలో వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస : ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ శ్రమజీవుల కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పది రోజుల క్రితం పగిలిపోయింది. అప్పటి నుంచి రోజూ తాగునీరు వృథాగా పోతోంది. మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న ఈ పంచాయతీలో ఇటీవల కొత్తగా రోడ్డు పనులు చేపట్టి పైప్‌లైన్లు వేశారు. అమర్చిన పైపులు వెంటనే పగిలిపోవడంతో కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి తాపం కారణంగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న తమకు ఈ తాగునీటి లీకేజీ మరో సమస్యగా తయారైందని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

ముగిసిన మజ్జిగ పంపిణీ

పీఎం పాలెం : జీవీఎంసీ 6వ వార్డు పీఎంపాలెంలోని తులసీనగర్ పార్కు వద్ద 40 రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన మజ్జిగ పంపిణీ బుధవారంతో ముగిసింది. స్థానిక వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసి పలువురి దాహార్తి తీర్చారు. ముగింపు కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.జ్యోతికమల, డిస్ట్రిక్ట్ గవర్నర్ టి.రంగారావు, ఎస్.ఐజక్, నందూరి రామకృష్ణ, మాదారపు సత్యనారాయణ, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ముత్తంశెట్టి జన్మదిన వేడుక



ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో సరకులు అందిస్తున్న నాయకులు



పద్మనాభంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు, తదితరులు



ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకల్లో వైఎస్సార్ సీపీ ఆనందపురం నాయకులు

భీమునిపట్నం: మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను బుధవారం భీమిలిలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలు అందించారు. జిల్లా మైనారిటీ సెల్ నాయకుల సహకారంతో ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో నిత్యావసర సరకులు అందించారు. అనంతరం అల్లిపిల్లి నర్సింగరావు మాట్లాడుతూ ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, యలమంచిలి సూర్యనారాయణ, ఎస్.కరుణాకర రెడ్డి, వాసుపల్లి కొండబాబు, భాస్కరరెడ్డి, కదిరి ఎల్లాజీ, జగ్గుపల్లి ప్రసాద్, బాకి రమణారెడ్డి, ముక్కి కృష్ణ, కర్రోతు నాగేంద్ర, వాసుపల్లి ఎల్లాజీ పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ఎవరూ భయపడొద్దని సూచించారు. ఎవరికి ఆపద వచ్చినా తమకు ఫోన్ చేయాలన్నారు. జి.వి.కె.కె.వర్మ, చందక శ్రీను, సీర సూరప్పడు, మరగడ అప్పారావు, అముజూరి అప్పారావు, సుంకర బంగారప్పడు, కోండ్రోతు శ్రీనివాసరావు, ఈర్ల ఈశ్వరరావు, తాలాడ పద్మనాభం, బేపల గురునాయుడు, పల్లి గోవింద, బోని సన్యాసినాయుడు, బొలె అప్పలనాయుడు, సుంకర నారాయణరావు, గాడు అప్పలరాజు, మజ్జి శంకర్ పాల్గొన్నారు.

తగరపువలస: మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలు ఆనందపురం ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద కార్యాలయంలో నిర్వహించారు. మజ్జి వెంకటరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బోని అప్పలనాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, మరుపిల్ల చిన్నయ్యపాత్రుడు, చందక సూరిబాబు, దొంతల కనకరాజు, కలిమి గంగరాజు, గుండు నానాజీ, బంక శ్రీను, గంటా జగదీష్, కూరాకుల వెంకటేష్, పినిశెట్టి సింహాచలం నాయుడు, సువ్వాడ జగ్గారావు, గొలగాని కృష్ణ, కోండ్రోతు అప్పలనారాయణ, షిణగం దామోదర్, అక్కిరెడ్డి దేవుడు, యర్ర అచ్చిబాబు పాల్గొన్నారు.

పీఎంపాలెం : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ 6వ వార్డులోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొలక శాతం పరిశీలించాకే విత్తనాల సరఫరా

- వ్యవసాయ శాఖ భీమునిపట్నం ఏడీ విజయ ప్రసాద్



మాట్లాడుతున్న భీమునిపట్నం సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయప్రసాద్

పద్మనాభం: విత్తనాల మొలక శాతం పరిశీలించాలని భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ ప్రసాద్ సూచించారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం వీఏఏలతో ఖరీఫ్ విత్తనాల సరఫరాపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వరి ఆర్‌జీఎల్ 2537 రకం 50 క్వింటాళ్లు, సాంబ మసూరి 95, 1121 రకం 485, సోనామసూరి 447, వేరుశనగ 25 క్వింటాళ్లు సరఫరా చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ విత్తనాలను ముందుగా మొలక శాతం కట్టి రైతులకు సరఫరా చేయాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలు 60 శాతం పంపిణీ చేసినట్టు తెలిపారు. మిగతా 40 శాతం విత్తనాలను రైతులకు పంపిణీ చేయాలన్నారు. మట్టి నమూనాలు సేకరించి భూసారం తెలుసుకునేందుకు పరీక్షల కోసం ప్రయోగశాలకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ పథకం కింద కూరగాయల తోటలు సాగు చేసే వారికి ఇవ్వడానికి పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయ శాఖ అధికారి పి.శ్రీకాంత్, ఉద్యానవన శాఖ అధికారి శిరీష, మండల వ్యవసాయ శాఖ అధికారి శిరీష పాల్గొన్నారు.


జీవనశైలి ఆధారంగానే సంతానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాధిక

తగరపువలస : ఆయా వ్యక్తుల జీవనశైలిపై ఆధారపడి మెరుగైన సంతానం లభిస్తుందని ఓయాసిస్ ఫెర్టిలిటి సెంటర్ వైద్యులు పొట్నూరు రాధిక, విజయలక్ష్మి సూచించారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 'హెల్దీ లైఫ్‌స్టైల్ ఫర్ వుమెన్ అండ్ మెన్' అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సంతానం కోసం నిపుణులను ఎప్పుడు సంప్రదించాలి, అందుబాటులో ఉన్న అధునాతన చికిత్సలను వివరించారు. అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ ఫారెస్ట్ రక్షణ గోడ శిథిలం



గంభీరం రిజర్వాయర్‌కి వెళ్లే రోడ్డులో శిథిలమైన రక్షణ గోడ



జాతీయ రహదారికి సమీపంలో పరదేశిపాలెం వద్ద శిథిలమైన రక్షణ గోడ

వన్య ప్రాణులతో పొంచి వున్న ప్రమాదం

మధురవాడ : కంబాల కొండ రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిన రక్షణ గోడ కొన్ని చోట్ల శిథిలమైపోయింది. ముఖ్యంగా పరదేశిపాలెం, గంభీరం రిజర్వాయర్లకు వెళ్లే రోడ్డుల్లో, కొమ్మాది – బోయిపాలెం మధ్య ఉన్న కొండ ప్రాంతంలో కొన్ని చోట్ల గోడ పడిపోయింది. దీంతో వన్య ప్రాణులు వెలుపలకు వచ్చేసి ప్రజలు, వాహనదారులకు హాని కలిగించే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో గంభీరం మాస్టర్ ప్లాన్ రోడ్డులో జింకలు రోడ్డుపైకి వచ్చేసి వాహనాలు ఢీకొనడంతో గాయాలపాలవుతున్నాయి. మరో వైపు రక్షణ గోడ లేకపోవడంతో కలప, వన్య మృగాలకు కూడా రక్షణ లేకుండా పోతోంది. గోడ కూలిపోయి చాలా కాలమైనా ఎవరూ పట్టించుకోవడం లేదని, అటవీశాఖ అధికారులు, సిబ్బంది చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కోతకు గురవుతున్న రహదారి



సంతపేట గొల్లవీధిలో డ్రైనేజీ నుంచి రహదారి వరకు శిథిలమైన దృశ్యం

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డు సంతపేట గొల్లవీధిలో 40 ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీలు శిథిలమై పక్కనే ఉన్న రహదారి కోతకు గురవుతోంది. డ్రైనేజీ అంచు నుంచి బీటీరోడ్డు వరకు శిథిలం కావడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు డ్రైనేజీలోకి జారిపడుతున్నాయి. గతంలో రెండుసార్లు తాతా థియేటర్ నుంచి పాత ఆంధ్రా బ్యాంకు వరకు బీటీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టినప్పుడు కాంట్రాక్టర్లు కావాలనే ఇక్కడ అరకొర పనులు చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ పూర్తిగా శిథిలమై బీటీరోడ్డు వరకు కోతకు గురైనా జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ఈ మార్గంలో శిథిలమైన డ్రైనేజీ, రహదారిని పునర్నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ



మాట్లాడుతున్న ఆచార్య వెలమల సిమ్మన్న

సీతంపేట : సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా 'విలక్షణ విమర్శకుడు శ్రీశ్రీ' అనే అంశంపై సాహిత్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ శ్రీశ్రీ అలుపు లేని అన్వేషి అని, వెనుదిరగని సాహసి అన్నారు. జనం జీవనాడి తెలుసుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రయోగశాలిగా, పదునైన విమర్శకుడిగా శ్రీశ్రీ వినుతికెక్కాడని అన్నారు. సహృదయ సాహితీ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన ముందుగా ఇటీవల దివంగతులైన సహృదయ సాహితీ సభ్యుడు టీపీఎన్ ఆచార్యులకు ఘన నివాళులు అర్పించారు. సాహితీవేత్తలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సి.హెచ్.చినసూర్యనారాయణ, కొత్తూరు రమణ పాల్గొన్నారు.

పక్కాగా పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి



కేంద్రంలో పుస్తకాలు పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

ఆరిలోవ: చినగదిలి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్ట్‌లు, నోట్ పుస్తకాలు ఉన్న కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఎంఈవోలను ఆదేశించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠ్య పుస్తకాల కేంద్రాన్ని ఆయన విద్యా విభాగం అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. చినగదిలి మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ఆయా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వారికి అవసరమైన పాఠ్య పుస్తకాలు వచ్చాయా? లేదా? తదితర వివరాల గురించి ఎంఈవోల ద్వారా తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఇక్కడ కేంద్రంలో ఉన్న పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలు కిట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ పుస్తకాల కిట్లను జాగ్రత్తగా మండలంలో అన్ని పాఠశాలలకు పంపిణీ జరిగేటట్లు ఎంఈవోలు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. మండలంలో 72 పాఠశాలల్లో 13,148 మంది విద్యార్థులున్నారన్నారు. వారిలో ప్రస్తుతం 83 శాతం మందికి పాఠ్య పుస్తకాలు రాగా, 100 శాతం మందికి సరిపడా నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. షూలు 80 శాతం, బెల్టులు 55 శాతం మందికి సరిపడా వచ్చినట్లు తెలిపారు. ఇంకా యూనిఫారం రాలేదని, కొద్ది రోజుల్లో రానుందని, వచ్చిన వెంటనే సరఫరా చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠ్య పుస్తకాల కిట్లు పంపిణీ రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన, ఎంఈవో-1 రవీంద్రబాబు, ఎంఈవో-2 అనురాధ, భవిత కోఆర్డినేటర్ గీత, పీఎంవో అప్పలనాయుడు, పీఆర్పీలు అప్పలరాజు, రాంబాబు, మండల కో-ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

శరవేగంగా ఆయుష్మాన్ ఆస్పత్రి పనులు



విమ్స్ ఆవరణలో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆస్పత్రి భవనం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో చేపట్టిన ఆయుష్మాన్ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి కోసం విమ్స్ ఆవరణలో ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ 50 పడకలతో ఈ ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో పనులు ప్రారంభించారు. ప్రశాంతమైన వాతావరణంలో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. విమ్స్‌లో ఇప్పటికే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఆయుష్మాన్ ఆస్పత్రి కూడా అందుబాటులోకి వస్తే మరింత ఎక్కువ మందికి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని నగరవాసులు ఆశిస్తున్నారు. వైద్యాధికారులు స్పందించి త్వరగా పనులు చేపట్టి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.